కూల్‌గా సమ్మర్ బిజినెస్



- ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లకు డిమాండ్
- మార్కెట్‌లో విభిన్న మోడల్స్‌లో లభ్యం
- కోట్లాది రూపాయల్లో వ్యాపారం

పట్టణంలో వ్యాపార వివరాలు	
సిరిసిల్లలో షోరూమ్స్	08
సాధారణ వ్యాపారులు	35
సమ్మర్‌లో బిజినెస్	రూ. 30కోట్లు

సండే స్పెషల్

సిరిసిల్లటౌన్: సమ్మర్ సీజన్ వ్యాపారులకు బాగా కలిసొచ్చింది. పేద, మధ్య, సంపన్న వర్గాల వారు వారి ఆర్థిక పరిస్థితికి తగ్గట్టుగా కూలర్లు, ఫ్రిజ్‌లు, ఏసీలు, ఫ్యాన్లను కొనుగోలు చేశారు. ఈ హాట్ సమ్మర్‌లో కూల్‌గా గడిపేందుకు మార్కెట్‌లో ఎన్నో ఆఫర్లను ఉపయోగించుకొని సాగిన వ్యాపారంపై సండే స్పెషల్ కథనం..

కలిసొచ్చిన సమ్మర్ ఆఫర్స్..

వేసవిలో ఎక్కువగా ఏసీలు, ఫ్యాన్లు, కూలర్లు, ఫ్రిజ్‌లకు ఆయా కంపెనీలు అందించిన ఆఫర్స్ జనాలకు కలిసొచ్చింది. ప్రస్తుతం కూలర్లు, ఫ్రిజ్‌లపై బ్రాండులను అనుసరించి 5 నుంచి 20 శాతం వరకు డిస్కౌంట్ ఇచ్చారు. ఇవే కాకుండా నిర్ణీత బ్యాంకుల క్రెడిట్, డెబిట్ కార్డులపై క్యాష్‌బ్యాక్ ఆఫర్లతో పాటు, స్క్రాచ్ కార్డులతో కస్టమర్లకు ఆర్థికంగా కలిసొచ్చింది.

వడ్డీలేని.. వాయిదాలు

షోరూంలు, ఏజెన్సీల నిర్వాహకులు వివిధ ఫైనాన్స్‌ల ద్వారా ఒప్పందం చేసుకొని వడ్డీలేకుండా నెలవారీగా సులభ వాయిదాలను ప్రవేశపెట్టారు. వివిధ బ్యాంకులు, ఫైనాన్స్‌ల కార్డులపై కొనుగోలు చేస్తే 5నుంచి 15శాతం వరకు తగ్గింపు కూడా ఇచ్చారు. దీంతో ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఫ్యాన్లు అమ్మకాలు పెరిగాయి. .

వారంటీ దీమా..

కస్టమర్లు కొనుగోలు చేసే ఎలక్ట్రానిక్ పరికరాలపై ప్రత్యేకంగా వారంటీ అందిస్తూ వారిలో దీమా కలిగించారు. తక్కువ ధర వారంటీ కాలం ఎక్కువగా ఉండే పరికరాలపై అవగాహన కల్పించడంతో బిజినెస్ మరింత పెరిగింది. వారంటీ కాలం కనీసంగా మూడేళ్ల నుంచి గరిష్టంగా ఐదేళ్ల వరకు వస్తువులను బట్టి ఆయా కంపెనీల ఆఫర్లను బట్టి అందించడం విశేషం. వస్తువును కొన్న సమయం నుంచి కొన్నినెలల వరకు చిన్నపాటి రిపేర్లకు ఫ్రీ సర్వీస్ అందనుండటం కస్టమర్లకు కలిసొచ్చింది.

అందరికీ అందుబాటు ధరల్లో..

వేసవిలో ఎక్కువగా అమ్ముడయ్యే ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఏసీలు సరికొత్త మోడళ్లలో మార్కెట్‌లో దొరుకుతున్నాయి. ఏసీలు రూ.25వేలు మొదలు రూ.1.50 లక్షలు, కూలర్లు రూ.3వేలు మొదలు రూ.25వేలు, ఫ్రిజ్‌లు రూ.10 వేలు మొదలు రూ.2లక్షలు, ఫ్యాన్లు రూ.300 మొదలు రూ.5వేలు వరకు ధరలు పలుకుతున్నాయి.

సేల్స్.. సర్వీస్

ఏసీల వాడకం పెరుగుతున్నా మధ్య తరగతి వర్గాలను ఆకట్టుకునేందుకు వ్యాపారులు, వివిధ కంపెనీలు సేల్స్ కం సర్వీస్ పద్ధతి కల్పించారు. కస్టమర్లు కేవలం వస్తువును కొనుగోలు చేసి అడ్రస్ ఇస్తే చాలు ఇంటికి వచ్చి వస్తువులను ఉచితంగా ఇన్‌స్టాల్ చేసి వెళ్తున్నారు. తమ ఉత్పత్తులు రిపేర్ వచ్చినపుడు కస్టమర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెకానిక్‌లను ఇంటికి పంపి రిపేరు చేయిస్తున్నారు. అందుకు ఎలాంటి డబ్బులు తీసుకోవడం లేదు.



రికార్డుస్థాయిలో బిజినెస్



ఈఏడాది రికార్డు స్థాయిలో ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఫ్యాన్లు అమ్మకాలు జరిగాయి. ఏసీల అమ్మకాల్లో ఐఎస్ఈఈఆర్ నిబంధనలు పాటించాం. చాలా బ్యాంకుల క్రెడిట్‌కార్డులకు ప్రత్యేకంగా ఇన్‌స్టాంట్ క్యాష్‌బ్యాక్ ఆఫర్లున్నాయి. సులభ వాయిదాల పద్ధతి మూలంగా వ్యాపారం జోరుగా జరిగింది.

– పోకల సుమన్, షోరూం యజమాని

ఆఫర్స్ బాగున్నయ్



రూపాయి చెల్లించకుండా షోరూంలో ఏసీని కొని సమ్మర్‌లో గడిపాం. జీరో పర్సెంట్ ఇంట్రస్ట్‌తో సులభ వాయిదాల్లో చెల్లిస్తున్నాం. కొత్తగా జీరో విండ్ టెక్నాలజీ ఏసీ కాబట్టి విద్యుత్ బిల్లు కూడా ఎక్కువ రావడం లేదు. హోం డెలివరీ, ఫ్రీ ఇన్‌స్టాలేషన్ చేశారు. సమ్మర్ ఆఫర్స్ బాగున్నాయి.

– ధర్మారెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

న్యూ మోడళ్లలో..

ప్రస్తుతం ట్రెండ్‌కు తగ్గట్టుగా మార్కెట్‌లో న్యూ మోడళ్లలో ఫ్రిజ్‌లు, కూలర్లు, ఫ్యాన్లు, ఏసీలు ఉన్నాయి. గాలి రాకుండా నేరుగా గది వాతావరణాన్ని చల్లబరిచే (విండ్ ఏసీ) విధానంతో ఏసీలు వచ్చాయి. అండర్‌లైటింగ్ ఫ్యాన్లు, రిమోట్ ఫ్యాన్లు, ఏసీ మోడల్ కూలర్లు, సాధారణ గడ్డితో కాకుండా హనీ ప్యాడ్స్ కూలర్లు, రిమోట్‌తో పనిచేసే కూలర్లు, బ్యాటరీ సహిత కూలర్లున్నాయి. అన్నిరకాల శీతల పరికరాలు రిమోట్ సిస్టమ్‌తో పనిచేయడమే కాకుండా ఇన్వోటర్ కంప్రెషర్ సిస్టమ్‌తో నడిచే మోడళ్లు మార్కెట్‌లో విరివిగా దొరకుతున్నాయి.

క్లుప్తంగా

విధుల్లో ఆలయ సిబ్బంది అప్రమత్తం

వేములవాడ: రాజన్న ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణ విధుల్లో సిబ్బందిని నిత్యం అప్రమత్తం చేస్తున్నారు. శాఖలవారీగా తనిఖీలు చేపడుతున్నారు. నిత్యం ఉదయం 6 గంటలకే సంబంధిత శాఖల ఏఈవోలు, పర్యవేక్షకులకు ఫోన్ చేసి విధుల్లోకి రావాలని ఆదేశిస్తున్నారు. ఒక్కోసారి వీడియోకాల్ చేయాలంటూ పురమాయిస్తున్నారు. సిబ్బంది సకాలంలో విధుల్లో లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. దీంతో గత రెండ్రోజులుగా ఆలయ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విధులకు హాజరవుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల ఎడ్యుకేషన్: ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని ఇంటర్‌లో ప్రవేశాల కోసం మిగిలిన సీట్ల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చిన్నబోనాల గురుకుల ప్రిన్సిపాల్ జాక్విలిన్ శనివారం తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 31లోగా గురుకుల సొసైటీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఆన్‌లైన్‌లో ఫీజుల చెల్లించాలని కోరారు.

'సర్వే తర్వాతే పనులు చేపట్టాలి'



బొల్లారం చెక్‌డ్యాం వద్ద జరుగుతున్న పనులు

వేములవాడరూరల్: మూలవాగులో నిర్మిస్తున్న చెక్‌డ్యాంతో తమ భూములకు నష్టం జరుగుతుందని తమకు న్యాయంచేసిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలని అధికారులకు రైతులు విన్నవించారు. వేములవాడ మండలంలోని బొల్లారం గ్రామ పరిధిలో నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనుల వద్దకు వెళ్లిన అధికారులతో వారు మాట్లాడారు. గత వానాకాలంలో చెక్‌డ్యాంతో తమ పొలాల్లోకి ఇసుక మేటలతో నష్టం జరిగిందని, ఇప్పుడైనా పూర్తి సర్వే చేపట్టిన తర్వాతే పనులు చేయాలని వారు కోరారు. దీంతో సర్వేయర్‌తో సర్వే చేయించిన అనంతరం పనులు చేపడుతామని అధికారులు తెలిపారు.

లక్ష్మీ నరసింహస్వామికి పూజలు



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని గుండారం శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గతంలో దర్శనానికి రాగా తేనెటీగలు దాడి చేశాయి. అనంతరం కోలు కున్న కాంగ్రెస్ నాయకుడు పిట్టల భూమేశ్, పార్టీ నాయకులు ఎడ్ల రాజ్‌కుమార్, జెజ్జరి నర్సయ్య, దండు శ్రీనివాస్, సామల వెంకన్న, జంగం మధు, శ్రీనివాస్, దేవేందర్, శ్రీకాంత్‌తో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్లలో సుమారుగా 300 మంది ఉపాధి హామీ కూలీలకు వట్టిమల్ల గ్రామానికి చెందిన దాదె జలపతి శనివారం మజ్జిగ పంపిణీ చేశారు. గత మంగళవారం మండలంలోని వెంకట్రావుపేటలో మట్టిపెళ్లలు కూలి ఓ మహిళ మృతిచెందగా ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇలాంటి సంఘటన మళ్లీ పునరావృతం కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోని ఉపాధి కూలీలకు, పనులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే కార్యక్రమానికశ్రీకారం చుట్టినట్లు వట్టిమల్లకు చెందిన దాదే జలపతి, జెట్టి హనుమండ్లు తెలిపారు. ముమ్ముందు పలు గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జెట్టి హన్మాండ్లు, గండి నరేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ సరిత, కార్యదర్శి జ్యోతి, కూలీలు పాల్గొన్నారు.

పౌల్ట్రీఫాం రైతుకు పరామర్శ



పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: విద్యుత్ సరఫరా నిలిచిపోయి దాదాపు వెయ్యి కోళ్లు మృతిచెంది ఆర్థికంగా నష్టపోయిన మండలకేంద్రానికి చెందిన పౌల్ట్రీఫాం రైతు సద్ది రాజిరెడ్డిని బీజేపీ నాయకులు శనివారం పరామర్శించారు. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పౌల్ట్రీ రైతు రాజిరెడ్డి నష్టపోయాడని, రూ.5లక్షల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, నాయకులు పారిపెల్లి సంజీవరెడ్డి, కిరణ్‌నాయక్, బంధారపు లక్ష్మారెడ్డి, నంది నరేశ్, వంగ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులున్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

- సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



మృతుడి భార్యకు చెక్కు అందజేస్తున్న కేటీఆర్

ఎల్లారెడ్డిపేట: కార్యకర్తలకు ఆపద సమయంలో అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మండలకేంద్రానికి చెందిన పెంటం కుమార్ అనే కార్యకర్త రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబానికి పార్టీ తరఫున రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..పార్టీలో పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకుల కుటుంబాలకు ఆసరాగా ఉండేందుకు ప్రమాదబీమా పథకం చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లి–రాచర్లబొప్పాపూర్‌లోని శ్రీ వాసవీమాత ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు అమ్మవారికి అభిషేకం, కలశ పూజ, నవగ్రహాల పూజ, అమ్మవారికి పారాయణ యజ్ఞం కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమపూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చేపూరి రాజేశం, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్'లో ఫీజులను నియంత్రించాలి



అభివాదం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలోని విద్యారంగంలో నెలకొన్న దోపిడీని అరికట్టాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం బీవైనగర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారన్నారు. అనుమతి లేని పాఠశాలల నిరోధించడంలో యంత్రాంగం విఫలమవుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యను వ్యాపారంగా భావిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకొని ఫీజులను నియంత్రించాలన్నారు. లేకపోతే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, అధ్యక్షుడు మంద అనిల్, ఉపాధ్యక్షుడు మనోజ్, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు మహేశ్, అరుణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రంజిత్, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, లంబాడి ఐక్యవేదిక అధ్యక్షుడు నరేశ్‌నాయక్, బహుజన సేన అధ్యక్షుడు శ్రీధర్ పాల్గొన్నారు.

ఫీజు నియంత్రణ చట్టం తేవాలి

రాష్ట్రంలో ఫీజు నియంత్రణ చట్టం తేవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారం చేస్తూ.. పేదలకు దూరం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈవిషయంలో జోక్యం చేసుకొని అధికఫీజులు వసూళ్లు చేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల హాస్టల్స్, యూనివర్సిటీల్లో వసతులు కల్పించాలని కోరారు. శ్రీనివాస్, ఎండీ రియాన్, నరేశ్, వెంకటేశ్, శ్రీకాంత్, భాను, అరవింద్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

సిరిసిల్లటౌన్: ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని నాన్ సీఈవో విద్యాలయాల్లో 2024–25 సంవత్సరానికి గాను జూనియర్ ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చిన్నబోనాల గురుకుల ప్రిన్సిపాల్ జాక్విలిన్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఈనెల 31న గురుకుల వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో సీట్లు ఉన్నాయన్నారు.

వృద్ధుడికి వీల్‌చైర్ అందజేత

సిరిసిల్లటౌన్: కుడికాలు తొలగించిన ఓ వృద్ధుడికి శనివారం జిల్లా సంక్షేమాధికారి వీల్‌చైర్‌ను అందించారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన భానోత్ రూప్‌సింగ్ అనే వృద్ధుడికి శస్త్రచికిత్స చేసి వైద్యులు కుడికాలు తొలగించారు. కొన్నిరోజుల తర్వాత ఎడమకాలి బొటనవేలు మినహా అన్ని వేళ్లు తొలగించగా పింఛన్ కోసం సదరం సర్టిఫికెట్ రావడం లేదని బాధితుడు కలెక్టరేట్‌కు వచ్చాడు. డీడబ్ల్యూవో డీఆర్డీఏ అధికారులతో మాట్లాడారు. మాట్లాడారు. సంక్షేమ శాఖ తరఫున వీల్‌చైర్‌ను అందించగా బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో పూజలు

ఎల్లారెడ్డిపేట: వర్షాలు సమృద్ధిగా కురువాలని కోరుతూ శనివారం రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలకేంద్రంలోని రావిచెట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో అకాలవర్షాలు పడవద్దని రైతులు గతంలో కట్టిన ముడుపును విప్పారు. గ్రామ పురోహితులు రాచర్ల దయానంద్‌శర్మ ప్రత్యేక పూజలు చేసి రోహిణి కార్తె సందర్భంగా ముడుపు విప్పారు. రైతు ప్రతినిధులు సద్ది నర్సింహారెడ్డి, నేవూరి నర్సింహారెడ్డి, ఒగ్గు బాల్‌రాజ్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, యమగొండ కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

'నేవూరి'కి డాక్టరేట్ ప్రదానం



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్, సామాజిక కార్యకర్త నేవూరి వెంకట్‌రెడ్డికి అమెరిక్ ఈస్ట్‌కోస్ట్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని దక్కన్ తాజ్‌ప్యాలెస్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. ఇరవైఏళ్లుగా చేస్తున్న పలు సామాజిక సేవాకార్యక్రమాలను గుర్తించి డాక్టరేట్ ప్రదానం చేసింది. 1066మంది నిరుపేద యువతుల వివాహాలకు పుస్తెమెట్టెలు అందించంతో పాటు వేసవిలో ట్యాంకర్లద్వారా నీటి సరఫరా చేశారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

- వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్



వేములవాడ రూరల్ : మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాస్

వేములవాడరూరల్: విత్తన డీలర్లు నాణ్యతతో కూడిన కంపెనీ విత్తనాలనే రైతులకు విక్రయించాలని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ సూచించారు. వేములవాడ ఏడీఏ కార్యాలయంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కంపెనీ విత్తనాలనే రైతులకు విక్రయించి రసీదులు ఇవ్వాలన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు ఫిర్యాదులు వస్తే తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేస్తామన్నారు. రైతులను మోసగించినట్లు తేలితే పీడీయాక్ట్ నమోదవుతుందన్నారు. ఏవో సాయికిరణ్, ఎస్సై మారుతి, కంపెనీ డీలర్లు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై రాజు హెచ్చరించారు. మండలకేంద్రంలో విత్తనాలు, పురుగుమందులు విక్రయించే షాపుల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. నకిలీ విత్తనాలు, కాలం చెల్లినవి విక్రయిస్తే కేసునమోదు చేస్తామన్నారు.

గంభీరావుపేట: విత్తనాల కొనుగోలులో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్, విస్తీర్ణాధికారులు అనూష, ప్రవీణ్, రాకేశ్, సాయిలు సూచించారు. మండలంలోని రైతు వేదికల్లో శనివారం రైతులతో సమావేశమయ్యారు. ప్రభుత్వ అనుమతులు పొందిన విత్తన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలని, రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్లపై కంపెనీ, తేదీలను పరిశీలించాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే వ్యవసాయాధికారులకు తెలపాలని రైతులను కోరారు.

ఘనంగా సన్మానం



ముస్తాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తోట ధర్మేందర్‌ను ఆ పార్టీ నేతలు శనివారం ఘనంగా సన్మానించారు. గల్ఫ్ బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని మాజీ సర్పంచ్ ఓనగంటి తిరుపతి పెద్దిగారి శ్రీనివాస్ అన్నారు. చంద్రం, రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



చెత్తకు నిప్పు.. చెట్లకు ముప్పు !

చందుర్తి: పంట చేన్లలోని చెత్తను రోడ్డు పక్కన వేసి నిప్పు పెట్టడంతో హరితహారం మొక్కలు దగ్ధమవుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామ శివార్లలోనూ ఇదే దుస్థితి. కాగా కొందరు యథేచ్ఛగా చెట్లు నరికివేస్తున్నా పట్టించుకోవడం లేదు. వేలాది రూపాయలతో హరితహారం మొక్కలు నాటుతున్నా వాటిని సంరక్షణలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలున్నాయి.

నిరుపేద గూడు చెదిరింది

- సిరిసిల్లలో కుప్పకూలిన పూరిల్లు



కూలిన ఇంట్లో పేద దంపతులు వేముల ఆంజనేయులు, లక్ష్మి

సిరిసిల్లటౌన్: అకస్మాత్తుగా ఇంటికప్పు కూలడంతో ఓ పేద కుటుంబం నిరాశ్రయులయ్యారు. బాధితులు తెలిపిన వివరాలు. సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన వేముల ఆంజనేయులు నేత కార్మికుడు, భార్య లక్ష్మి బీడీ కార్మికురాలు. శాంతినగర్‌లోని పూరింట్లో నివసిస్తున్నారు. శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో ఇంటి పై కప్పు హఠాత్తుగా కుప్పకూలింది. త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఈ సంఘటనలో రూ.35వేలు విలువైన సామగ్రి ధ్వంసమైంది. నిలువ నీడలేని తమను ప్రభుత్వం ఆదుకోవాలని ఆ నిరుపేద దంపతులు కోరుతున్నారు.

ఆర్థికసాయం అందజేత



గంభీరావుపేట: ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

సిరిసిల్లటౌన్: కోనరావుపేట మండలం.. వెంకట్రావుపేటలో మట్టిపెళ్లలు పడి ఓ మహిళ మృతిచెందగా బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి అందిన రూ.50వేల చెక్కును అధికారులు అందజేశారు. శనివారం మృతురాలు కుమారుడు బాలకిషన్‌కు ఆర్థికసాయం అందించారు.

గంభీరావుపేట: మండలంలోని బీఎస్పీ నాయకులు కర్రోల్ల రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఎస్సెస్సీ 2002 బ్యాచ్ స్నేహితులు శనివారం రూ. 31వేల ఆర్థికసాయంగా అందించారు. ఇక్కడ నరేశ్, బాలనర్సు, సత్యం, చంద్రం, చంద్రం, పవన్‌కుమార్, రాజ్‌కుమార్, వికాస్‌బాబు, కిషోర్, లక్ష్మణ్, బాలరాజు, తదితరులున్నారు.

'విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలి'



సెస్ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట గ్రామ పంచాయతీ పరిధిలో చాలామంది రైతులు పొలాల్లో లూజ్‌లైన్లు సరిచేసి ప్రమాదాలను నివారించాలని కోరుతూ శనివారం సెస్ ఏఈ పృథ్వీధర్ గౌడ్‌కు రైతులు విన్నవించారు. ఎల్లమ్మ ఆలయం వద్ద మొత్తం 33 మంది రైతుల బోర్లు ఉన్నాయని, అక్కడ విద్యుత్ వైర్లు లూజ్‌గా ఉండగా సరిచేసేందుకు ఆరు మిడిల్ పోల్స్ వేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూస్తామని ఏఈ రైతులకు హామీఇచ్చారు.

కుదిరిన వేతన ఒప్పందం

గంభీరావుపేట: బీడీ కంపెనీ యజమానులు, కార్మిక సంఘం నాయకుల మధ్య శనివారం వేతన ఒప్పందం కుదిరింది. బీడీ కార్మికులు, నెలసరి ఉద్యోగులు, బీడీ ప్యాకర్స్‌కు వేతనాలు పెరగనున్నాయి. బీడీ కార్మికులకు వెయ్యి బీడీలకు రూ.4.25, నెలసరి ఉద్యోగులకు రూ.1700, ప్యాకర్లకు రూ.3,650 చొప్పున వేతనాలు పెరగనున్నాయి. పెరిగిన వేతనాలు మే నెల నుంచే అమలుకానున్నట్లు కార్మిక సంఘం నాయకులు శివంది సత్యం తెలిపారు.

'ప్రభుత్వ కళాశాలల్లోనే చేరండి'

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు శనివారం ప్రచారం నిర్వహించారు. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తమ కళాశాలలో చేరాలని కోరారు. వెంకటాపూర్, పోతిరెడ్డిపల్లె, అగ్రహారం, హరిదాస్‌నగర్, నారాయణపురంలో ఇంటింటా ప్రచారం చేశారు. అధ్యాపకులు పర్శరాములు, భూమక్క, నీరటి విష్ణుప్రసాద్, కొడిముంజ సాగర్, చిలుక ప్రవళిక, అగోలం గౌతమి పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి ముఠా?

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలో శనివారం పోలీసులు గంజాయి ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండగా వారిని అదుపులోకి తీసుకుని, గంజాయి ఉన్నట్లు గుర్తించి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఇల్లంతకుంట పోలీసులు నేడో, రేపో గంజాయి ముఠాను అరెస్టు చూపే అవకాశముంది.